

బుద్ధ పార్కు పున:ప్రారంభం

ఏలూరు టౌన్ : నగరంలోని బుద్ధ పార్కును నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు శుక్రవారం పున:ప్రారంభించారు. కరోనా, అనివార్య కారణాల వల్ల కొంతకాలంగా పార్కు మూత పడిందన్నారు. పార్కును మళ్లీ పూర్తిగా సుందరీకరించారన్నారు. మళ్లీ ఎప్పటిలాగే బోట్ షికార్, ఫౌంటెన్, క్యాంటిన్ ప్రారంభించారు. త్వరలోనే జెట్ ఫౌంటెన్లను ఏర్పాటు చేస్తున్నారని మేయర్ అన్నారు. నగర ప్రజలందరూ పార్కుకు విచ్చేసి ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదించాలని మేయర్ నూర్జహాన్ కోరారు. తొలుత బుద్ధ విగ్రహానికి పూలమాల వేశారు. నగరంలో ఉన్న అన్ని పార్కులను సుందరీకరించడం జరిగిందని, వేసవి కాలంలో వృద్ధులు, విద్యార్థులు నగర ప్రజలందరూ పార్కులకు వెళ్లి ఆహ్లాదకరమైన వాతావరణంలో గడపాలని మేయర్ కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, స్థానిక కార్పొరేటర్ పిల్లంగోళ్ల శ్రీదేవి, అసిస్టెంట్ కమిషనర్ బాపిరాజు, ఎంహెచ్ డాక్టర్ మాలతి, కాంట్రాక్టర్ గోలి శరత్‌రెడ్డి, పాండురు మురళి శ్యామ్ పాల్గొన్నారు.

ధాన్యం..గట్టెక్కేదెలా..!


- తుపాను హెచ్చరికలతో రైతుల్లో ఆందోళన
- కన్నీటి సంద్రంలో అన్నదాత
- సంచుల్లేక కల్లాల్లోనే ధాన్యం
- వర్షాలకు తడిసి, మొలకలొస్తున్న పరిస్థితి
- రైతులకు రాజకీయాలు ఆపాదించి ఇవ్వని సంచులు
- యథేచ్ఛగా మిల్లర్ల దోపిడీ
- ఉమ్మడి పశ్చిమలో 50 శాతం ధాన్యం కల్లాల్లోనే

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'నా పేరు సంపతి వెంకటేశ్వరరావు. మాది కైకరం గ్రామం. 11 ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగుచేశాను. గతనెల 22న మాసూలు పూర్తిచేశాను. కానీ ఇప్పటి వరకూ సంచులు ఇవ్వలేదు. వర్షాలకు ధాన్యం తడిసి మొలకలు వస్తున్నాయి. రైతులకు రాజకీయాలు ఆపాదించి సంచులు ఇవ్వకుండా చేస్తున్నారు. ధాన్యాన్ని ఏ విధంగా గట్టెక్కించాలో తెలియడం లేదు.'


'నా పేరు సానం ఏడుకొండలు. మాది కైకరం. పదెకరాలు కౌలుకు తీసుకుని వరి సాగుచేశాను. గతనెల 18న మాసూలు చేశాను. ఇంకా 500 సంచులేక అలానే ఉండిపోయాయి. వర్షాలకు తడిసి ధాన్యం మొలకలు వస్తున్నాయి. ధాన్యం కాపాడుకునేందుకు నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఎప్పటికి ధాన్యం వెళ్తుందో తెలియడం లేదు.'

పైన పేర్కొన్న సమస్యలను ఎదుర్కొంటున్నది వెంకటేశ్వరరావు, ఏడుకొండలు మాత్రమే కాదు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లో వరిసాగుచేసిన వేలాది మంది రైతులది ఇదే పరిస్థితి. మాసూలు చేసిన కల్లాల్లో ఉన్న ధాన్యం అమ్ముకునేందుకు సంచులేక, లారీలు లేక నానా అవస్థలు పడుతున్నారు. మాసూలు చేసి 20 రోజులు గడుస్తున్నా ఇప్పటికీ సంచులు ఇవ్వని పరిస్థితి కొనసాగుతోంది. ధాన్యం కొనుగోలులో నూతన విధానం అస్తవ్యస్తంగా తయారైంది. సంచులు, లారీల విషయంలో అధికారులు పూర్తిగా చేతులెత్తేశారు. దీంతో రైతులు గందరగోళానికి గురవుతున్నారు. బంగాళాఖాతంలో పొంచి ఉన్న తుపాను హెచ్చరికలతో రైతులు మరింత ఆందోళనకు గురవుతున్నారు. ఈ నెల తొమ్మిదో తేదీకి అల్పపీడనం తుపానుగా మారనున్నట్లు చెప్తున్న హెచ్చరికలు రైతులకు కంటిమీద కునుకులేకుండా చే స్తున్నాయి. ఏలూరు జిల్లాలో 79వేల ఎకరాలు, పశ్చిమలో 2.13లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగుచేశారు. ఏలూరు జిల్లాలో 3.90 లక్షల మెట్రిక్ టన్నులు, పశ్చిమలో 9.28 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. రెండురోజుల క్రితం అధికారులు విడుదల చేసిన లెక్కల ప్రకారం చూస్తే పశ్చిమ గోదావరి జిల్లాలో 2.30 లక్షల మెట్రిక్ టన్నులు, ఏలూరులో 1.15 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. అంటే రెండు జిల్లాల్లో కలిపి 3.50 లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. అధికారుల లెక్కల ప్రకారం చూస్తే ఇంకా దాదాపు ఎనిమిది లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. దాదాపు 50 శాతానికిపైగా ధాన్యం కల్లాల్లోనే ఉండిపోయింది. లారీలు, సంచులు అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. మంత్రులు, ఎంఎల్‌ఎలు రైతుల వంక కనీసం చూడటం లేదు. రైతులకు రాజకీయాలు ఆపాదించి సంచులు ఇవ్వడం లేదంటూ పలువురు రైతులు గగ్గోలు పెడుతున్నారు. రైతులకు రాజకీయాలు ఆపాదించడం ఏమిటో కూడా అర్ధంకావడం లేదు.



ఆరబెట్టకపోతే మొలకలు.. ఆరబెడితే వర్షం

వారంరోజులుగా వర్షం రైతులను వెంటాడుతోంది. ప్రతిరోజూ ఏదో ఒక సమయంలో వర్షం పడుతూనే ఉంది. దీంతో రైతుల పరిస్థితి దారుణంగా మారింది. వర్షాలకు తడిసిన ధాన్యం ఆరబెట్టకపోతే మొలకలు వస్తున్నాయి. ఆరబెడితే వర్షానికి మళ్లీ తడిసిపోతుంది. ఆరబెట్టిన తర్వాత వర్షం వస్తే ధాన్యం మళ్లీ రాశులుగా పోయాలంటే చాలా కష్టం. దీంతో రైతులకు ఏంచేయాలో అర్ధంకాక తలలు పట్టుకుంటున్నారు. ఉంగుటూరు మండలం నాచుగుంట, కైకరం వంటి గ్రామాల్లో ఇప్పటికే తడిసిన ధాన్యం మొలకలు రావడంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. రవాణాకు లారీలు రావడం లేదని, సంచులు ఇవ్వడం లేదని రైతులు మొత్తుకుంటున్నా ఏ ఒక్కరికీ పట్టడం లేదు. గతనెల 16వ తేదీన ధాన్యం కొనుగోలు ప్రారంభించారు. 20 రోజులు దాటుతున్నప్పటికీ సమస్యలు పరిష్కారంకాలేదు. మిల్లర్లు పెడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీకావు. ముక్క పేరుతో పెద్దఎత్తున డబ్బులు వసూలు చేస్తున్నారు. ఖరీఫ్‌లో తేమపేరుతో రైతుల నుంచి దోచేసిన మిల్లర్లు, రబీలో ముక్క పేరుతో దోపిడీ చేస్తున్నారు. మిల్లర్లను ప్రభుత్వం అదుపుచేయలేని పరిస్థితి నెలకొంది. ఈనెల మొదటివారం గడిచిపోతున్నా ఇంకా కల్లాల్లోనే ధాన్యం ఉండిపోవడంతో, వర్షాలతో పంట గట్టెక్కేదెలా అంటూ అన్నదాతలు మదనపడుతున్నారు.



ఆందోళన చేస్తున్న రైతులు, నాయకులు

ధాన్యం కొనుగోలు అలసత్వంపై

అన్నదాత ఆగ్రహం

ప్రజాశక్తి - ఉంగుటూరు

గోనె సంచుల కొరత, ధాన్యం కొనుగోలులో అలసత్వంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఎపి రైతుసంఘం, ఎపి కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో మండలంలోని కైకరం రైతు భరోసా కేంద్రాన్ని శుక్రవారం ముట్టడించారు. 'గోనె సంచులు ఇవ్వండి.. ధాన్యం రవాణాకు లారీలు ఏర్పాటు చేయండి' అంటూ నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు. ధాన్యం కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బందులు పెట్టడంతో దిక్కు తోచని స్థితిలో ఉన్నామని కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సంచులు ఇచ్చి త్వరితగతిన ధాన్యం కొనుగోలు చేయాలని ఆత్మహత్యే శరణ్యం రైతు భరోసా కేంద్రం అధికారులతో వాగ్వాదానికి దిగారు. చివరకు అధికారులు సమస్య పరిష్కారానికి హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఇన్‌ఛార్జి తహశీల్దార్ నాగరాజు ఫోన్ ద్వారా మాట్లాడుతూ గోనె సంచులు, లారీల సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే అన్నదాతకు కష్టాలు

ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రైతులు కష్టాలు, నష్టాలు బారిన పడ్డారనిఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. ఈ ఆందోళనలో పాల్గొన్న వారు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గోనె సంచులు కూడా అందించలేకపోతున్నారని విమర్శించారు. పలుకుబడి ఉన్న వారికే గోనె సంచులు ఇచ్చి లారీలు ఏర్పాటు చేయడం వల్ల కౌలు రైతులు, పేదరైతులు రైతు భరోసా కేంద్రం వద్ద పడిగాపులు పడాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కొనుగోలులో ఆలస్యం వల్ల వర్షాలకు ధాన్యం తడిసిపోయి మొలకలు వచ్చాయన్నారు. అకాల వర్షాలకు తడిసి మొలకలు వచ్చిన ధాన్యాన్ని కనీస మద్దతు ధరకే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలులో సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నరసింహ, సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకటకృష్ణారావు, కౌలు రైతు సంఘం జిల్లా కన్వీనర్ కొర్ని అప్పారావు, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు సున్నా వెంకటరావు, గంటా పాపారావు, రైతులు, కౌలు రైతులు గున్ను సూర్యారావు, మన్నే జనార్దనరావు, బలే పోతురాజు, ఒబిలినేని సత్యనారాయణ, సంపద వెంకన్న, అన్నెపు శ్రీరామ్మూర్తి, ఒడిసి పెద్దిరాజు, చింతా వెంకటేశ్వరరావు, ఆకుల సాయిబాబు, పి.సత్యనారాయణ, తుంపాల అర్జున పాల్గొన్నారు.



ఏలూరు అన్నే భవనంలో నివాళులర్పిస్తున్న నాయకులు

ఆదర్శప్రాయులు కార్ల్‌మార్క్స్

ప్రజాశక్తి - ఏలూరు

మానవ మనుగడకు మంచి మార్గాన్ని చూపిన, ప్రపంచానికి మార్క్సిజాన్ని అందించిన కార్ల్‌మార్క్స్ మహనీయుడని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గుడిపాటి నరసింహరావు కొనియాడారు. స్థానిక పవరుపేటలోని ఉద్దరాజు రామం భవనంలో కార్ల్‌మార్క్స్ జయంతి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.కిషోర్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. తొలుత నరసింహరావు కార్ల్ మార్క్స్ చిత్రపటానికి పూలమాల వేశారు. నరసింమరావు మాట్లాడుతూ మార్క్స్ ఉన్నతమైన సంపన్న కుటుంబంలో జన్మించి 1840 నాటికే పిహెచ్‌డి చేసి, ఆయన తత్వశాస్త్రం, న్యాయశాస్త్రం, చరిత్ర, మొత్తం మానవాళికి సంబంధించిన అన్ని శాస్త్రాలను అధ్యయనం చేసి, ప్రపంచంలోనే గొప్పదైన లండన్ మ్యూజియంలోని వేలాది పుస్తకాలను చదివిన మొదటి వ్యక్తిగా కార్ల్ మార్క్స్ నిలిచారని తెలిపారు. మార్క్సిజం పేరుతో ప్రపంచానికి ముఖ్యమైన మూడు అంశాలను అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు ఎ.శ్యామలరాణి, జిల్లా నాయకులు పి.ఆదిశేషు, నగర నాయకులు వి.సాయిబాబు, జె.గోపి, కట్టా సత్యనారాయణ, జి.కోటేశ్వరరావు, ఎం.సత్యం, బి.త్రినాథ్, బి.రవి తదితరులు పాల్గొన్నారు.

కార్ల్‌మార్క్స్ జీవితం ప్రపంచానికి ఆదర్శప్రాయమని ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు అన్నారు. పవర్‌పేటలోని అన్నే భవనంలో కార్ల్‌మార్క్స్ జయంతి సందర్భంగా అవగాహన కార్యక్రమం జరిగింది. తొలుత మార్క్స్ చిత్రపటానికి ఎవిఆర్ విజ్ఞాన్ కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, కమిటీ సభ్యులు వి.సురేష్, జి.శారద, పి.కిషోర్ మార్క్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దుర్గాప్రసాద్, ఠాగూర్, పూజిత జె.గోపి జోహార్లు తెలిపారు. ఈ సందర్భంగా గుడిపాటి నరసింహారావు మార్క్స్ జీవితం ఆయన రచనలు, సిద్ధాంత విషయాలను వివరించారు. అనంతరం వి.సురేష్ మాట్లాడారు.

ఏలూరు అర్బన్ : ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమ దిక్సూచి, తత్వవేత్త, కమ్యూనిస్టు ప్రణాళిక రచయిత కార్ల్ మార్క్స్ జయంతి శుక్రవారం సిపిఐ ఏలూరు సమితి ఆధ్వర్యంలో ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్ అధ్యక్షతన ఆర్‌ఆర్ పేట స్ఫూర్తి భవన్‌లో నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య మాట్లాడుతూ మార్క్స్ ప్రపంచం మొత్తాన్ని రెండు వర్గాలుగా, దోపిడీ చేసే వర్గం, దోపిడీకి గురయ్యే వర్గంగా విభజించారన్నారు. దోపిడీకి గురయ్యే వర్గ పక్షాన ఉద్యమాలు నిర్వహించాలని, వారి హక్కుల రక్షణకు ఉద్యమించాలని ప్రపంచానికి చాటి చెప్పిన మహోన్నతుడు కార్ల్ మార్క్స్ అని కొనియాడారు. సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మార్క్స్ రచించిన కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక ఆధారంగానే భారత దేశ స్వాతంత్ర ఉద్యమంలో విప్లవ దశ ప్రారంభమైందని తెలిపారు. మనదేశంలో బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు మార్క్స్ స్ఫూర్తితో పోరాటాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఏలూరు ఏరియా సమితి సహాయ కార్యదర్శి కురెళ్ల వరప్రసాద్, కార్యదర్శి వర్గ సభ్యురాలు మావూరి విజయ, అడ్డగర్ల లక్ష్మీఇందిరా, శ్రీను, హకీమ్, కనకదుర్గారావు పాల్గొన్నారు.

విప్లవ సాంస్కృతికోద్యమ రథసారథి, అమరుడు అరుణోదయ రామారావు విప్లవ స్ఫూర్తితో ఉద్యమించాలని, మోడీ-షాలు అవలంభిస్తున్న ఫాసిస్టు ధోరణులకు వ్యతిరేకంగా పోరాడాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. అరుణోదయ సాంస్కతిక సమాఖ్య అధ్యక్షులు రామారావు నాలుగో వర్ధంతి సభ స్థానిక మార్కెట్ యార్డులో అరుణోదయ జిల్లా నాయకులు ఎర్రా శ్రీనివాసరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి యు.వెంకటేశ్వరరావు, ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య నగర అధ్యక్షులు పల్లి గంగరాజు మాట్లాడుతూ ప్రజా కళలను అభివృద్ధి చేయటంలో రామారావు కీలకమైన పాత్ర పోషించారన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు హమాలీ జుట్టు కార్మిక సంఘం కార్యదర్శి గడసాల రాంబాబు, పట్టణ హమాలీ కార్మిక సంఘం అధ్యక్షులు డి.వీరనాయుడు, కూరగాయల ముఠావర్కర్ యూనియన్ కార్యదర్శి రంగాల నూకరాజు, యార్డ్ హమాలీ వర్కర్స్ యూనియన్ కోశాధికారి గడసాల వెంకటరమణ, కోరాడ అప్పారావు, నిమ్మకాయలు మోత కార్మిక సంఘం కార్యదర్శి పండు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : కార్ల్ మార్క్స్, గౌతమ్ బుద్ధుని ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని ఐద్వా మండల కార్యదర్శి నేలటూరి నిర్మల అన్నారు. మండల కేంద్రంలో కార్ల్ మార్క్స్, గౌతమ్ బుద్ధుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచంలో పేదల బతుకులు మార్పు కోరేది మార్క్స్ పెట్టుబడి గ్రంథమేనన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు నేలటూరి అప్పారావు, భగత్ సింగ్ కాలనీ ఉపాధ్యక్షులు గజ్జల వెంకన్న బాబు, నాయకులు షర్మిల సీత నాగబాబు తదితరులున్నారు.

ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టపరచాలి

కొనసాగిన 'ఉపాధి' పరిరక్షణ జిల్లా యాత్ర

ప్రజాశక్తి - యంత్రాంగం

ఉపాధి హామీ చట్టాన్ని పటిష్ట పరచాలని, నిధులు పెంచి కూలీల సమస్యలు పరిష్కరించాలని, 200 రోజులు పని, రోజు కూలి రూ.600 చెల్లించాలని, మోనటరింగ్ ఫొటో విధానం, రెండో పూట పనిని రద్దు చేయాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఉపాధి చట్ట పరిరక్షణ యాత్ర రెండో రోజు శుక్రవారం జిల్లాలో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయా మండలాల్లో యాత్ర సభ్యులు కూలీల వద్దకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.



ఉంగుటూరులో..

కొయ్యలగూడెం: ఉపాధి హామీ పనిలో నేషనల్ మొబైల్ మోనటరింగ్ ఫొటో విధానాన్ని రద్దు చేయాలని రెండు పూట పనిని తొలగించాలని కోరుతూ ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఉపాధి కూలీల సమస్యలపై చేపట్టిన ప్రచారయాత్ర శుక్రవారం కొయ్యలగూడెం చేరుకుంది. నరసన్నపాలెం, సీతంపేట, బయ్యనగూడెం, కొయ్యలగూడెం, గవరవరం, చొప్పరామన్నగూడెం గ్రామాల్లో యాత్ర సాగింది. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ చట్టాన్ని తీసివేయాలని కుట్ర పన్నుతున్నారన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో ఈ చట్టానికి మోడీ ప్రభుత్వం రూ.30 వేల కోట్లు తగ్గించిందని ఆవేదన వ్యక్తంచేశారు. 200 రోజులు పని దినాలు, రూ.600 రోజు వేతనం, పే స్లిప్పులు, గతంలో ఇచ్చిన పనిముట్లు, మజ్జిగ, తాగునీరు, గుణపం, తట్ట, పార, ఆటో ఛార్జీలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్ల బోయిన రాంబాబు మాట్లాడుతూ పనిప్రదేశాల్లో టెంట్లు, మెడికల్ కిట్లు, ఆశా, ఎఎన్‌ఎంలను నియమించాలని కోరారు. ఈ చట్టంలో అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పైసమస్యల పరిష్కారం కోసం ఈనెల పదో తేదీన జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో ఉపాధి కూలీలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీల సంఘం జిల్లా నాయకురాలు తామ ముత్యాలమ్మ, వై.సీత, వ్యవసాయకార్మికసంఘం నాయకులు కామన సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జంగారెడ్డిగూడెం మండల కార్యదర్శి అందుగుల ప్రభాకర్, లలీతకుమారి, ప్రభావతి, వెంకటేశర్, బాలస్వామి, దుర్గ, మహాలక్ష్మి, లంకా సత్యనారాయణ, చల్లా వెంకటలక్ష్మి, జుత్తిగ వెంకటలక్ష్మి, తాళ్లపూడి సూర్యనారాయణమ్మ, ఆకుల వెంకటలక్ష్మి పాల్గొన్నారు.



కొయ్యలగూడెంలో..

ఉంగుటూరు : ఉపాధి హామీ పరిరక్షణ జిల్లాయాత్ర మండలంలో రాచూరు, సీతారామపురం, నారాయణపురం, చేబ్రోలు, గ్రామాల్లో సాగింది. ఈ సందర్భంగా నాయకులు కూలీలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి కుట్రలు చేస్తోందన్నారు. పాతపద్ధతిలో ఉపాధి పనులు చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు టి.సత్యనారాయణ, రాజశేఖర్, జి.సత్యనారాయణ, సిఐటియు నాయకులు రమణారావు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

నిడమర్రు : ఉపాధి కూలీలకు సమ్మర్ అలవెన్స్‌లు, పే స్లిప్పులు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జక్కంశెట్టి సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం భువనపల్లిలో ఉపాధి హామీ రక్షణ జిల్లా యాత్రను జక్కంశెట్టి సత్యనారాయణ, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నారపల్లి రమణరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ యాత్రలో సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, నాయకులు తుమ్మల సత్యనారాయణ, రాజశేఖర్, జి.సత్యనారాయణ పాల్గొన్నారు.

నిడమర్రు : ఉపాధి హామీ చట్టంలో పాత పద్ధతిలోనే సమ్మర్ అలవెన్స్, పే స్లిప్‌లు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర జక్కంశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మండలంలోని భువనపల్లి గ్రామంలో ఉపాధి హామీ రక్షణ జిల్లా యాత్రను వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జక్కంశెట్టి సత్యనారాయణ, బిల్డింగ్ వర్క్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నారపల్లి రమణరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీని నీరుగార్చే ప్రయత్నాలు కొనసాగిస్తుందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి హామీకి నిధులు కేటాయించి చట్టాన్ని పరిరక్షించాల్సిన కేంద్రప్రభుత్వం తీసేయాలని చూస్తుందన్నారు. ఉపాధి హామీలో నేషనల్ మొబైల్ మానిటరింగ్ ఫొటోస్ సిస్టంను తీసుకొచ్చి చట్టాన్ని ఎత్తివేసేందుకు ప్రయత్నించడం సిగ్గు చేటన్నారు. ఇప్పటికే రెండు పూటలా పనిని పెట్టి కూలీలకు మజ్జిగ, పనిముట్లు, మెడికల్ కిట్స్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీల పట్ల మొండిగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ఉపాధి హామీ పని ప్రదేశాల వద్ద కూలీలను కలుసుకుని వారి సమస్యలు అడిగి తీసుసుకున్నారు. రెండు పుట్లా పనిని వెంటనే రద్దు చేయాలని కోరారు. కేంద్ర బడ్జెట్‌లో నిధులు పెంచి చట్టాన్ని కాపాడాలన్నారు. కుటుంబానికి రెండు వందల రోజులు పని దినాలు, కనీస వేతనం రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీలో కాంట్రాక్టర్ల పద్ధతిని ఎత్తివేయాలని కోరారు. యాత్ర నాయకులుగా సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ వహించగా సభ్యులుగా తుమ్మల సత్యనారాయణ, రాజశేఖర్, జి.సత్యనారాయణ పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : ఉపాధి హామీ చట్టం పరిరక్షణకు జరుగుతున్న యాత్ర రెండో రోజు మండలంలో జైనవారిగూడెం, రెడ్డిగణ పవరం, పాలకుంట నాగులగూడెం, అంతర్వేదిగూడెం, దొరమామిడి కోటనాగవరం, బుట్టాయిగూడెం, చీమల వారిగూడెం గ్రామాల్లో పర్యటించారు. ఉపాధి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ముత్యాలమ్మ మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి హామీ కూలీల బకాయిలు రూ.20 లక్షల బకాయిలు ఉన్నాయన్నారు. తక్షణమే కూలీలకు వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 200 రోజులు పనులు కల్పించి, రూ.600 కూలి ఇవ్వాలని, ప్లేసిప్‌లు ఇవ్వాలని కోరారు. సమస్యలపై మే పదో తేదీన జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిం చనున్నట్లు తెలిపారు. ఈ యాత్రలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.జీవరత్నం, ఎ.ప్రభాకరరావు, వై.సీత, పిల్లి దుర్గారావు, జి.వెంకట్రావు, పి.నాగేశ్వరరావు, జె.సూర్యచంద్రం, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

జిఒ 1ని ఉపసంహరించుకోవాలి

ఏలూరు: అప్రజాస్వామిక జిఒ నెంబర్‌కు వ్యతిరేకంగా రాష్ట్రంలో ఒక వైపు ఆందోళనలు జరుగుతుంటే పకడ్బందీగా అమలు చేయమని ముఖ్యమంత్రి చెప్పడం విడ్డూరమని, ముఖ్యమంత్రి వ్యాఖ్యలను సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి తీవ్రంగా ఖండించారు. ప్రజా ఉద్యమాలను, పౌరహక్కులను హరించివేసే జిఒ నెంబర్ 1ని వెంటనే ఉపసంహరించుకోవాలని రవి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను సమీక్ష చేస్తూ జిఒ నెంబర్ 1ని పటిష్టంగా అమలు చేయాలని నిన్న ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించినట్లు వచ్చిన వార్తలు ఆశ్చర్యాన్ని కలిగించాయన్నారు. జిఒ నెంబర్ 1కు వ్యతిరేకంగా రాష్ట్రంలో పౌరహక్కుల సంఘాలు, ప్రజాసంఘాలు, లాయర్లు, మేధావులు, ప్రజాస్వామిక వాదులు, రాజకీయ పార్టీలు నిరంతరంగా నిరసనలు, ఆందోళనలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వంలో చలనం లేకపోగా మరింత తీవ్రంగా అమలు చేయమని చెప్పడం అంటే అప్రజాస్వామికంగా వ్యవహరించడమేనని విమర్శించారు. ఇప్పటికే రాష్ట్రంలో అప్రకటిత నిషేధాజ్ఞలు కొనసాగుతున్నాయని, ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాల సభలకు అనుమతినివ్వడం లేదని, ముఖ్యమంత్రి జిల్లాల పర్యటనలకు ముందే గృహనిర్బంధాలు, ముందస్తు అరెస్టులు చేస్తున్నారని తెలిపారు. జిఒను ఉపసంహరించుకోకపోతే వైసిపి ప్రభుత్వం ప్రజాగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

దళితుల గోడు పట్టని ప్రభుత్వం

కొనసాగిన దోసపాడు పేదల ఆందోళన

ప్రజాశక్తి - దెందులూరు రూరల్



చెరువుల్లోకి వెళ్లి చేపలు పడుతున్న దళితులు

దోసపాడు పేదలు, దళితులు పది నెలల నుండి తమ భూముల కోసం నిరంతర పోరాటం చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా రెవెన్యూ అధికారులు, పోలీసులు కనీసం పట్టించుకోకపోవడం దుర్మార్గమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు పి.ఆనందరావు విమర్శించారు. ఈ సందర్భంగా పేదలు భూముల్లోని ఆక్వా చెరువులో చేపలు పట్టారు. 'భూమి మాదే.. పంట మాదే.. హక్కులు మాకే దక్కాలి' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ ఏడాది క్రితం ప్రారంభమైన దోసపాడు భూ పోరాటం పేదలకు, దళితులకు అండగా వ్యవసాయ కార్మిక సంఘం నిలిచిందన్నారు. ఈ పోరాటంలో పేదలు, దళితులు పలుమార్లు మండల రెవెన్యూ శాఖ అధికారులు, జిల్లా అధికారులను కలిసి గోడు విన్నవించుకున్నా కనీసం పట్టించుకోలేదని మండిపడ్డారు. పేదల హక్కులను కాలరాస్తూ, దళితుల చట్టాలను నీరుగారుస్తూ తీవ్రమైన అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు కట్టి మూడు నెలలు దాటినా నేటికీ ఆ కేసులో ఉన్న నిందితులను అరెస్టు చేయకపోవడం దుర్మార్గమన్నారు. పోలీసులు, రెవెన్యూ శాఖ అధికారులు భూస్వాములిచ్చే లంచాలు మింగి పేదలకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. పేదలకు అనుకూలంగా భూములు సాగు చేసుకోవచ్చని చెప్పినా రెవెన్యూ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. పేదల ఓట్లతో గెలిచిన ఎంఎల్‌ఎకు, మంత్రులకు దోసపాడు దళితులు, పేదలు కనబడటం లేదా అని విమర్శించారు. జిల్లా రెవెన్యూ శాఖ అధికారులు దోసపాడు దళితుల పట్ల వివక్ష చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని కోరారు. నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామంలో 144, 145 సెక్షన్లు ఎత్తివేసి పేదలకు రక్షణ కల్పించాలన్నారు. భూములు ఆక్రమించుకుని అనుభవిస్తున్న వారిపై అసైన్డ్ యాక్ట్ సెక్షన్-4 ప్రకారం అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఏప్రిల్ పదో తేదీ నుండి జరగబోయే పరిణామాలకు, పోరాటాలకు, ఉద్యమానికి రాష్ట్ర ప్రభుత్వం జిల్లా రెవెన్యూ శాఖ అధికారులు, పోలీసులే బాధ్యత వహించాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు డి.గంగాధర్, నాగేంద్ర, పవన్, సునీల్, మణి, బేబీ, లలిత, దుర్గ, శ్రీను, ఏసుమణి, హేమలత పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

తహశీల్దార్‌కు టిడిపి నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాసులు వినతి

ప్రజాశక్తి - పోలవరం

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని టిడిపి నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో తహశీల్దార్ బి.సుమతికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గత పది రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో నాలుగు లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయన్నారు. అకాల వర్షాలతో చేతికొచ్చిన పంట నష్టపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రోజుల తరబడి కురుస్తున్న భారీ వర్షాలతో కోస్తా, రాయలసీమ జిల్లాల్లో పంటలు నీటిలో నాని నష్ట తీవ్రత రోజురోజుకూ పెరుగుతోందన్నారు. ధాన్యంతో పాటు పొగాకు, మిరప, మొక్కజొన్న, పసుపు, శనగ, వేరుశనగ, మామిడి, అరటి, ఇతర ఉద్యాన పంటలు బొప్పాయి, నిమ్మ పంటలు దెబ్బతిని రైతులు కోలుకోలేని విధంగా దెబ్బతిన్నారన్నారు. వర్షాలతో పంటపొలాల్లో నీరు నిలవడంతో ధాన్యాన్ని పొలం నుంచి రోడ్డుపైకి చేర్చేందుకు రైతులు అధికమొత్తం ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వరి, మొక్కజొన్న పంటలు తడిసి మొలకలు వచ్చే పరిస్థితి ఏర్పడిందన్నారు. అధికారులు పంట నష్టం అంచనా వేసి త్వరితగతిన పరిహారం అందించాలని, అకాల వర్షాలకు దెబ్బతిన్న, రంగుమారిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని, రబీ ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని కోరారు. నాణ్యత కోల్పోయిన ఇతర పంటలను కూడా కొనుగోలు చేయాలని, నష్టపోయిన వరి, మొక్కజొన్న రైతుకు ఎకరాకు రూ.30 వేల చొప్పున పరిహారం అందించాలని కోరారు. మిర్చి, అరటి, మామిడి రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారం అందించాలని, రాయితీపై విత్తనాలు అందించి రైతులను ఆదుకోవాలని, పిడుగుపాటుకి గురై మరణించిన కుటుంబాలకు ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షులు కుంచే దొరబాబు, పార్టీ మండల మాజీ అధ్యక్షులు పాపోలు గణపతి రత్తయ్య, ప్రధాన కార్యదర్శి నునకాని రాంబాబు, సర్పంచి సబ్బారపు శ్రీరామ్మూర్తి, పార్టీ టౌన్ అధ్యక్షులు పోతుల శ్రీనివాసరావు, క్లస్టర్ ఇన్‌ఛార్జి ఆకుల రాజా, జల్లేపల్లి జితేంద్ర,పాదం ప్రసాద్, కొత్తపల్లి సత్యనారాయణ, సోమరౌతు వెంకటేశ్వరరావు, యడ్ల వినోద్, కుంచే రాజేష్, పివివి.సత్యనారాయణ పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - ముసునూరు

ఉపాధి హామీ కూలీలకు రోజువారి పని వేతనాలు వారం పూర్తి కాగానే ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పిల్లి మురళి అన్నారు. మండలంలోని ముసునూరు, కాట్రంపాడు, గోపవరం, వేల్పుచర్ల, చల్లబోయినపల్లి, బలివే, ఎల్లాపురం గ్రామాల్లోని ఉపాధి హామీ పనులు ప్రదేశం వద్ద కూలీలతో వారు మాట్లాడారు. ఈ నెల 13వ తేదీన నూజివీడు సబ్ కలెక్టర్ ఆఫీస్‌లో ఉపాధి హామీ కూలీల సమస్యలపై వినతపత్రం ఇవ్వనున్నట్లు కూలీలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద రోజులు పని దినాలను 200 రోజులకు పెంచాలని, రోజువారీ వేతనం రూ.270 నుండి రూ.600 పెంచాలని, పని ప్రదేశంలో ఉపకార వేతనాలతో కూడిన అలవెన్స్ అందించాలని, డిజిటల్ యాప్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

బీమాను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - పోలవరం

మండలంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ ఇన్సూరెన్స్‌తో వ్యక్తిగత ప్రమాద బీమా పాలసీని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పోలవరం ఎస్‌బిఐ బ్రాంచ్ మేనేజర్ ఎస్.నవీన్ కుమార్ కోరారు. పోలవరం ఎస్‌బిఐ బ్రాంచ్ కార్యాలయంలో శనివారం ఎస్‌బిఐ జనరల్ ఇన్సూరెన్స్‌తో వ్యక్తిగత ప్రమాద బీమా పాలసీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి ఏడాది రూ.వెయ్యి ప్రమాద బీమా చెల్లిస్తే రూ.20 లక్షలు కవరేజ్, రూ.500 చెల్లిస్తే రూ.పది లక్షల కవరేజ్, 200 చెల్లిస్తే రూ.నాలుగు లక్షల కవరేజ్, రూ.వంద చెల్లిస్తే రూ.రెండు లక్షలు కవరేజ్ చేకూరుతుందన్నారు. ఈ బీమా పాలసీలో 18 నుంచి 65 సంవత్సరాల వయసు గల వారు అర్హులని బ్యాంక్ మేనేజర్ తెలిపారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

రైతులు పండించిన పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పిస్తుందని మండల వ్యవసాయ శాఖ అధికారి డి.ముత్యాలరావు తెలిపారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌లో మొక్కజొన్న, వరి, చెరకు, వేరుశనగ పంటలు ు సాగు చేస్తున్నారని తెలిపారు. మండలంలో వ్యవసాయ శాఖ ద్వారా ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని మండలంలోని టి.నరసాపురం, బొర్రంపాలెం సొసైటీల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మొక్కజొన్న సాగు చేసిన రైతులందరూ స్థానిక రైతు భరోసా కేంద్రాల వద్ద పేరు నమోదు చేయించుకోవాలని సూచించారు. రైతులు కొనుగోలు కేంద్రాలను వినియేగించుకోవాలన్నారు.

'ప్రజా సంక్షేమమే వైసిపి లక్ష్యం'

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జన సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని పోలవరం ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు అన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా దర్భగూడెం పంచాయతీలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి గడపకు తిరుగుతూ ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన నాలుగు సంవత్సరాలుగా ఎన్నో అభివృద్ధి పథకాలను ప్రవేశ పెట్టిన ఘనత ఒక్క వైసిపి ప్రభుత్వానికే సాధ్యమైందన్నారు. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందఅన్నారు. పంచాయతీలో ప్రతి కుటుంబానికి జరిగిన లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. ఒక్క దర్భగూడెం పంచాయతీలోనే మొదటి విడతలో 153 ఇల్లు మంజూరయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు కొల్లూరి రాంబాబు, జెడ్‌పిటిసి సభ్యులు వసంతరావు, సర్పంచి సున్నం ఉషారాణి, ఉప సర్పంచి రాఘవరెడ్డి, ఎంపిటిసి సభ్యులు కంచర్ల సుధారాణి, సచివాలయం కన్వీనర్ వనమా రామకృష్ణ, సీనియర్ నాయకులు ప్రసాద్, శ్రీనివాస్, కుంజ రాముడు, ప్రేమ్‌కుమార్, రాము, తహాశీల్దార్ జి.ఎలీషా, ఎంపిడిఒ మంగతాయారు, ఎంఇఒ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో ఉపాధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని సుంకొల్లు, ముక్కొల్లుపాడు, దిగవల్లి, నరసన్నపాలెం, పోతిరెడ్డిపల్లి, వేంపాడు, రావిచెర్ల, రేగుంట, పోనసానపల్లి పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులకు శుక్రవారం 3600 మంది కూలీలు పాల్గొన్నట్లు ఎపిఒ సోమేశ్వరి తెలిపారు. ఈ పథకంలో భాగంగా మామిడి చెట్లకు పాదులు చేయడం, చెరువులకు నీళ్ల వచ్చే సప్లై ఛానల్ బాగు చేయడం, మట్టి రోడ్ల నిర్మాణం, గట్టులను బలపరచడం వంటి పనులు చేసినట్లు ఆమె తెలిపారు. ఉపాధి కూలీలు పనులకు హాజరై పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎపిఒ విజ్ఞప్తి చేశారు.

తిరుమలకు కూరగాయల తరలింపు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని పరిసర ప్రాంత గ్రామ రైతులు తిరుమల తిరుపతి దేవస్థానంలో నిత్యాన్నదాన కార్యక్రమానికి శుక్రవారం కూరగాయలను వితరణ చేశారు. ఈ సందర్భంగా రైతు నక్క సత్యనారాయణ మాట్లాడుతూ వంగ 70 బస్తాలు, అరటి 30 గెలలు, గుమ్మడి రెండు టన్నులు, 2500 సొరకాయలు, మామిడి టన్ను, బెండ టన్ను, మిర్చి రెండు క్వింటాళ్లు, దోస నాలుగు క్వింటాళ్లు, కరివేపాకు రెండు మోపులు, దుంపలు పది బస్తాలు పంపుతున్నట్లు తెలిపారు. ప్రతి నెల టిటిడి అన్నదానానికి పంపిస్తామన్నారు.

ఇన్‌ఛార్జి ఎంపిడిఒకు పలువురి అభినందన

ప్రజాశక్తి - మండవల్లి

పోగొట్టుకున్న ఆరోగ్యశ్రీ కార్డును తిరిగి ఇప్పించి వైద్యం పొందేలా సహకరించిన ఇన్‌ఛార్జి ఎంపిడిఒ పి.మల్లేశ్వరిని బాధితులతో పాటు ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు అభినందించారు. చావలిపాడు గ్రామానికి చెందిన కె.నాగరాజు ఆరోగ్యశ్రీ కార్డును పోగొట్టుకున్నాడు. జిరాక్స్ కాపీ కూడా లేకపోవడంతో వైద్యం చేయడానికి వైద్యులు నిరాకరిస్తున్నారు. దీంతో ఆరోగ్యశ్రీ కార్డు కోసం చావులపాడు సచివాలయం చుట్టూ గత మూడు సంవత్సరాల నుంచి తిరుగుతున్నప్పటికీ ఎవరూ పట్టించుకోలేదు. దీంతో లోకముడిలోని సిఎన్‌ఆర్ గార్డెన్ కళ్యాణ మండపంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కి అర్జీతో విజ్ఞప్తి చేశారు. తనకు కళ్లు లేవని, సచివాలయ సిబ్బంది పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఆరోగ్యశ్రీ కార్డును అందిస్తే వైద్యం చేయించుకుంటాననంటూ కలెక్టర్‌ని కోరాడు. దీంతో కలెక్టర్ సమస్యను పరిష్కరించి ఆరోగ్యశ్రీ కార్డు అందించేలా చర్యలు తీసుకోవాలని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ పి.మల్లేశ్వరికి సూచించారు. దీంతో ఆమె స్పందించి సచివాలయ సిబ్బందితో బాధితులతో మాట్లాడి ఆరోగ్యశ్రీ కార్డును అందించారు. మూడేళ్ల నుంచి పరిష్కారం కాని సమస్య చిటికెలో పరిష్కారం కావడంతో అటు బాధితులు ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు హర్షం వ్యక్తం చేసి మల్లేశ్వరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్ భాస్కర్ మాట్లాడుతూ అధికారులంతా సమన్వయంతో పని చేస్తూ ప్రజాస్వామ్యంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని ఆయన కోరారు.

శరవేగంగా వంతెన నిర్మాణ పనులు


ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి - దేవరం గ్రామాల మార్గంలో అన్నవరం మేజర్ డ్రెయిన్‌పై ఆక్వా రైతులు స్వచ్ఛందంగా నూతన వంతెన నిర్మాణ పనులు ప్రారంభించారు. గత ఐదు రోజులుగా రైతులు జెసిబి, పొక్లెయిన్‌లో వంతెన నిర్మాణ పనులు చేస్తున్నారు. గత మార్చి నెల 28వ తేదీన పాత వంతెనపై వ్యాన్ వెళ్లడంతో ఆకస్మాత్తుగా వంతెన కుప్పకూలింది. దీంతో ముదినేపల్లి-దేవరం గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఆక్వా రైతులు ప్రత్నామ్నాయంగా చెక్కతో డ్రెయిన్‌పై కాలిబాట వంతెన నిర్మించారు. ద్విచక్ర వాహనదారులు, ప్రజలు నడించేందుకు ఇబ్బంది లేకుండా పోయింది. దేవరం ఆయకట్టులో ఆక్వా సాగు చేసే రైతులు తాము పండించిన పంట చేపలు, రొయ్యలు ఎగుమతులు, దిగుమతులు చేసుకునేందుకు వాహనాలు దేవరం వెళ్లేందుకు వీలుగా నూతన వంతెన నిర్మాణం చేపట్టారు. ప్రభుత్వం నూతన వంతెన మంజూరు చేయకపోవడంతో చేసేదిలేక రైతులంతా కలిసి తమ వంతు విరాళాలు సేకరించి లారీలు దేవరం వెళ్లేందుకు ప్రత్యామ్నాయంగా వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దీని కోసం 15 భారీ తూములు, తీసుకొచ్చి డ్రెయిన్‌లో బేస్‌మెంట్ వేసి దానిపై తూములు అమర్చుతున్నారు. ఈ వంతెన నిర్మాణం కోసం సుమారు రూ.20 లక్షల వరకు ఖర్చు ఆవుతుందని ఆక్వా రైతులు చెబుతున్నారు.



వంతెన నిర్మాణ పనులు

ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రాఘవన్‌కు డిఎల్‌పిఒగా ఉద్యోగోన్నతి



రాఘవన్‌ను సత్కరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు ఇన్‌ఛార్జి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పని చేసిన రాఘవన్ ఉద్యోగోన్నతిపై రంపచోడవరం డివిజనల్ స్థాయి పంచాయతీ అధికారిగా (డిఎల్‌పిఒ)గా బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రతినిధులు, అధికారులు, కార్యాలయ సిబ్బంది, ప్రముఖులు రాఘవన్‌ను భీమడోలు పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం సత్కరించారు. ఈ సందర్భంగా రాఘవన్ మాట్లాడుతూ తన హయాంలో భీమడోలు మండల పరిషత్ ఉపాధి హామీ పనుల నిర్వహణలో జిల్లాలో ప్రథమ స్థానం, జగనన్న గృహ నిర్మాణాల్లో నాలుగో స్థానం, ప్రాధాన్యత భవనాల నిర్మాణంలో సముచిత స్థానం దక్కించుకుందన్నారు. పంచాయతీరాజ్ దినోత్సవం పురస్కరించుకుని మండలంలోని సూరప్పగూడెం గ్రామపంచాయతీ మౌలిక సదుపాయాలు కల్పనలో రాష్ట్రస్థాయిలో ఉత్తమ పంచాయతీగా ఎంపికైందని తెలిపారు. భీమడోలు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహి స్తున్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పనితీ రుకు జిల్లాస్థాయిలో ఉత్తమ పంచాయతీగా ఎన్నికైం దన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామపంచాయతీగా దుద్దేపూడి గ్రామపంచాయతీ రాష్ట్రస్థాయి ఎంపికకు అర్హత సాధించిందన్నారు. ఇదే క్రమంలో కోడూరు పాడు, లక్ష్మీపురం గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఆధునీకరించామని తెలిపారు. భీమడోలు కేంద్రంగా ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం జిల్లా స్థాయిలో ఇతర పంచాయతీ అధికారులకు, సిబ్బందికి శిక్షణ ఇచ్చే కేంద్రంగా ఏర్పడిందని తెలిపారు. వీటన్నింటికీ భీమడోలు ఎంపిపి కె.రామయ్య, కార్యాలయం సిబ్బంది సింహాద్రి, జెడ్‌పిటిసి సభ్యులు తుమ్మగుంటి భవానిరంగా, భీమడోలు సర్పంచుల ఛాంబర్ అధ్యక్షురాలు పి.సునీతమాన్సింగ్, ఇతర ప్రముఖులు అందించిన సహాయ సహకారాలు కారణమని తెలిపారు. అనంతరం తన బాధ్యతలను భీమడోలు పంచాయతీరాజ్ సహాయ ఇంజినీర్ డి..సత్యనారాయణకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో భీమడోలు సొసైటీ అధ్యక్షులు రాయపాటి సత్యశ్రీనివాస్, ఎంపిటిలు సభ్యులు, సర్పంచులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నూజివీడు రూరల్ : మండలంలో ఎంపిడిఒగా విధులు నిర్వహిస్తున్న ఎంపిఎస్.సుందరి డిఎల్‌పిఒగా ఉద్యోగోన్నతి పొందారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తంకుమార్ ఆధ్వర్యంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి వెంకటాపురం సచివాలయం-5లో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల చెంతకు న్యాయ సేవలు తీసుకురావాలనే ఉద్దేశంతో టెలీలా పోర్టల్ ను ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ టెలీలా యాప్ డౌన్‌లోడ్ చేసుకుని చేసుకుని తమ ఫిర్యాదులను నేరుగా ఆయా న్యాయ సేవాధికార సంస్థలకు దాఖలు చేసుకోవచ్చని తెలిపారు. శనివారం ఏలూరు కలెక్టరేట్ భవనంలో అన్ని ఇన్సూరెన్స్ కంపెనీల అధికారులతో జిల్లా కలెక్టర్, జిల్లా న్యాయాధికారులు సంయుక్తముగా వాహన ప్రమాద కేసుల సత్వర పరిష్కారం నిమిత్తం సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్యానల్ లాయర్ జివి.భాస్కర్ పాల్గొన్నారు.

గోపీనాథపట్నంలో బాల ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభం

ఉంగుటూరు :గోపీనాథపట్నం సచివాలయంలో ఐదేళ్లు నిండిన బాలలకు కొత్తగా ఆధార్ ఎన్‌రోల్‌మెంట్‌ను శుక్రవారం సర్పంచి, మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షుడు విష్ణుమూర్తి ప్రారంభించారు. గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులతో పాటు ప్రభుత్వ బడిలో చదివే వారందరికీ ఆధార్ లేనివారు ఇక్కడి కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచి కోరారు. సచివాలయ కార్యదర్శి బ్రహ్మానందం, సచివాలయ ఉద్యోగులు సేవలందించారు.

8 నుంచి వేసవి శిక్షణ శిబిరాలు

ప్రజాశక్తి - ఏలూరు

బాలల గ్రంథాలయంలో ఈ నెల ఎనిమిదో తేదీ నుంచి జూన్ 16వ తేదీ వరకు ఉదయం ఎనిమిది గంటల నుంచి 12 గంటలకు వరకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు బాలల గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు జిల్లెల్లముడి నరసింహరావు, గ్రంథాలయ నిర్వాహకురాలు ఎం.శోభ తెలిపారు. ఈ కార్యక్రమంలో 6 నుంచి పదో తరగతి విద్యార్థులకు డ్రాయింగ్, స్పోకెన్ ఇంగ్లీష్, మెడిటేషన్, వెస్టన్ డాన్స్, నీతి పద్యాలు, నీతి కథలు చదివించడం, వాటి అర్థాలను వివరిస్తారని తెలిపారు. ఈ శిబిరంలో పాల్గొనాలనుకునే విద్యార్థులు ముందుగా గ్రంథాలయంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.


భీమడోలు : పౌర గ్రంథాలయ సంస్థ జిల్లా శాఖ ఆధ్వర్యంలో భీమడోలు శాఖా గ్రంథాలయంలో ఈ నెల 8వ తేదీ నుంచి జూన్ 16వ తేదీ వరకు 40 రోజుల పాటు కొనసాగే ఉచిత వేసవి విజ్ఞాన శిబిరం సేవలను వినియోగించుకోవాలని గ్రంథ పాలకులు కె.శ్రీనివాసరావు కోరారు. విద్యార్థుల్లో విజ్ఞానం పెరిగేందుకు, వినోదం కల్పించేందుకు శిక్షణా తరగతులు దోహదపడతాయన్నారు. శిక్షణా తరగతుల్లో నీతి కథలు, పుస్తకాలు చదవడం, డ్రాయింగ్ ఇతర అంశాలను అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరిస్తారని తెలిపారు. శిక్షణా తరగతులు ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు కొనసాగుతాయన్నారు. ఆసక్తిగల విద్యార్థులు తమ పేర్లను ముందుగా గ్రంథ పాలకుల వద్ద నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. శిక్షణా తరగతుల్లో పాల్గొన్న వారికి పౌర గ్రంథాలయ సంస్థ సర్టిఫికెట్లను అందిస్తుందని తెలిపారు.

ఏలూరు అర్బన్ : వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఇండోర్ స్టేడియం స్కేటింగ్ రింగ్‌లో స్కేటింగ్ విభాగాన్ని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సిఇఒ ఎండిహెచ్ మెహరాజ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరాలను ఎక్కువ మంది విద్యార్థులు వినియోగించుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్కేటింగ్ కోచ్ షేక్ ఖాసిం, స్కేటింగ్ క్రీడాకారులు 50 మంది పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలని వినతి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఏజెన్సీ షెడ్యూల్ ప్రాంతంలో గ్రామ పంచాయతీల అభివృద్ధికి నిధులు కేటాయించి సహకరించాలని న్యూ డెమోక్రసీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజును కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పంచాయతీల్లో కరెంట్ లైన్లు అస్తవ్యస్తంగా ఉండి వైర్లు కిందకి సాగిపోయి ప్రమాదస్థాయిలో ఉన్నాయన్నారు. వాటికి నూతన స్తంభాలను ఏర్పాటు చేసి కరెంట్ లైన్‌లో మరమ్మతులు చేయించాలన్నారు. గ్రామపంచాయతీల్లో వీధిరోడ్లు, సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థను నిర్మించాలన్నారు. మంచినీటి సమస్య పరిష్కారం కోసం నూతన ట్యాంకులను నిర్మించాలన్నారు. ఖాళీగా ఉన్న గ్రామపంచాయతీ కార్యదర్శుల పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాన్ని గిరిజన గ్రామ పంచాయతీలను అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, మన గ్రామ పంచాయతీలో సమస్యల పరిష్కారం కోసం అభివృద్ధి కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ నాయకులు ధర్ముల సురేష్, పోరండ్ల శ్రీనివాస్, కారం రాఘవ, సర్పంచులు శ్రీరాములు, కోరసా గంగరాజు, కె.ముక్కరెడ్డి, సుండ్రు శారద, కారం లక్ష్మి, ఎంపిటిసి సభ్యులు గోవిందరాజు, మడకం వెంకటలక్ష్మి, పంచాయతీ వైస్ ప్రెసిడెంట్లు చింతల కృష్ణ ముసలారెడ్డి పాల్గొన్నారు.




వినతిపత్రం అందిస్తున్న ప్రజాప్రతినిధులు

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి - భీమడోలు

గ్రామ పంచాయతీ పరిధిలోని అర్జావారిగూడెం ఆవాస ప్రాంతంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులైన వారిని ఆదుకునేందుకు భీమడోలు తహశీల్దార్ షంషుద్దీన్ ఆధ్వర్యంలోని రెవెన్యూ బృందం, మూడో నెంబర్ గ్రామ సచివాలయ సిబ్బంది, వైసిపి ప్రముఖులతో పాటు భీమడోలు గ్రామ సర్పంచి పి.సునీతమాన్సింగ్, జెడ్‌పిటిసి సభ్యులు తుమ్మగుంట భవానిరంగా ముందుకు వచ్చారు. శుక్రవారం వీరందరూ అగ్ని ప్రమాదం కారణంగా నిరాశ్రయులైన రెండు కుటుంబాల వారిని పరామర్శించారు. వీరికి రూ.30 వేలు ఆర్థిక సహాయం, 200 కేజీల బియ్యం, నిత్యవసర వస్తువులు, దుస్తులను అందించారు. ఇదే క్రమంలో ఏలూరుకు చెందిన రోటరీక్లబ్, మానవత సంస్థ సహాయాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా భీమడోలు తహశీల్దార్ షంషుద్దీన్ మాట్లాడుతూ అగ్ని ప్రమాద బాధితులను ఆదుకునే క్రమంలో ప్రభుత్వపరంగా మంజూరు కానున్న నష్టపరిహారం ఇతర సహాయాలతో పాటు, అగ్నిప్రమాద బాధితులు తిరిగి ఇల్లు నిర్మించుకునేందుకు గృహ నిర్మాణ సంస్థ ద్వారా రెండు యూనిట్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి, జెడ్‌పిటిసి సభ్యులు, తహశీల్దార్‌తో పాటు భీమడోలు సొసైటీ అధ్యక్షులు రాయపాటి సత్యశ్రీనివాస్, పసుపులేటి సత్యనారాయణ, డాక్టర్ పి.మాన్సింగ్, ఎంపిటిసి సభ్యులు ముళ్లగిరి జాన్సన్, రామకుర్తి నాగేశ్వరరావు, పసుపులేటి సత్యనారాయణ పాల్గొన్నారు .



సాయం అందిస్తున్న తహశీల్దార్

నేరాలు - ఘోరాలు

కాలువలోకి దూసుకెళ్లిన ఆటో

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని కొర్లగుంట గ్రామం నుంచి చంద్రాలకు ప్రయాణికులతో వెళ్తున్న ఆటో శుక్రవారం తెల్లవారుజామున మండల శివారు గ్రామం బత్తులవారిగూడెం గ్రామ సమీపంలో ఎన్ఎస్‌పి కాలువలో బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన రంగమ్మ, వెంకటరమణ, సరోజినీ, అఖిల్, తీవ్ర గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లో విజయవాడ తరలించారు. రూరల్ ఎస్ఐ రాధాకృష్ణారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి అదృశ్యం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండల పరిధిలోని నూగొండపల్లి సిఆర్‌పిఎఫ్ అవుట్‌పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న తూర్పుగోదావరి జిల్లా అల్లవరానికి చెందిన బోరా శ్రీనివాస్ కనిపించడంలేదని సిఆర్‌పిఎఫ్ ఎస్ఐ చేసిన ఫిర్యాదు మేరకు ఆగిరిపల్లి ఎస్ఐ ఎన్.చంటిబాబు కేసు నమోదు చేశారు. ఉన్నతాధికారుల నుంచి ఎటువంటి అనుమతి తీసుకోకుండా, విధులకు హాజరు కాకుండా, ఏప్రిల్ 30వ తేదీ తరువాత నుంచి కనపడుట లేదని ఫిర్యాదు చేశారు.

మొక్కజొన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి - చాట్రాయి

ప్రభుత్వాలు నిబంధనల పేరుతో కల్లాల్లో ఉన్న పంటకు నష్టపరిహారం ఇవ్వడానికి అవకాశం లేదని, అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు మొండి చేయి చూపాలని చూడడం జగన్ రెడ్డి ప్రభుత్వానికి తగదని టిడిపి నూజివీడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్‌ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. నూజివీడు నియోజకవర్గ పరిధిలోని చాట్రాయి మండలం, పోలవరం తదితర గ్రామాల్లో అకాల వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న తదితరుల పంటలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉందని, నష్టపరిహారం నమోదుకు కల్లాల్లో పోసిన పంటను గుర్తించడానికి ప్రభుత్వ నిబంధనలు వర్తించడం లేదని వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ అధికారులు పేర్కొనడం తగదన్నారు. అన్నదాతను కడగండ్లు పాలు చేసే వారి ఉసురు ఈ ప్రభుత్వానికి తగలక తప్పదన్నారు. జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక వరుసగా రెండు సంవత్సరాలు కోవిడ్ వల్ల పంటలను అమ్ముకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా అన్నదాతల కష్టాలను గుర్తించి తక్షణం వారికి నష్టపరిహారం అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు జగ్గవరపు వెంకటరెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు ముసునూరు రాజా, నూజివీడు మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి యనమదల సత్యనారాయణ (నాని), పర్వతనేని సాయికృష్ణ, తేనేటి కిరణ్ పాల్గొన్నారు.



చాట్రాయి : అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, తగిన పరిహారం అందించాలని జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శులు గుత్తా వెంకటేశ్వరరావు, మోరంపూడి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్ సిహెచ్.విశ్వనాధరావుకు శుక్రవారం వినతిపత్రం పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పరసా శ్రీనివాసరావు, మోదుగు ముత్తయ్య, తుమ్మల లక్ష్మిసాంబశివరావు, రాయవరపు పుల్లయ్య, గవర వెంకటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాజమార్గం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

రాజీ మార్గమే రాజ మార్గమని గ్రామాలల్లో చిన్న చిన్న గొడవలతో కేసులు పెట్టుకొన్నవారిని సమన్వయపర్చి కోర్టు సమక్షంలో వారిని రాజీ పడేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆగిరిపల్లి ఎస్ఐ ఎన్.చంటిబాబు అన్నారు. ఆగిరిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఉన్నతాధికారుల ఆదేశానుసారం రాజీపడదగ్గ కేసులు విషయంలో చేపట్టాల్సిన చర్యల గురించి తమ సిబ్బందికి శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ తఫ్వీర్ నాయక్, పోలీసు సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

ఫిజికల్ ఫిట్‌నెస్ సమ్మర్ క్యాంపు ప్రారంభం

ప్రజాశక్తి -ద్వారకా తిరుమల

పిల్లల ఫిట్‌నెస్ కోసం వేసవి సెలవులు సద్వినియోగం చేసుకునేందుకు, పిల్లలు ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉండేందుకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏలూరు వారి ఇండోర్ రోయింగ్ ఎర్గో మీటర్, ఫిజికల్ ఫిట్నెస్ సమ్మర్ క్యాంపు ద్వారకా తిరుమల వసంత్‌నగర్ కాలనీలో శుక్రవారం ఊదర్ల విజయ్ స్పోర్ట్స్ మేన్ గోల్డ్ మెడలిస్ట్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఇంచుమించు నెలరోజులు స్కూలు పిల్లలకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ద్వారకాతిరుమల గ్రామం చుట్టుపక్కల ఉన్న చిన్నారులు క్యాంపులో పాల్గొని అర్హత సాధించి తగిన సర్టిఫికెట్లు పొందగలరని తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - భీమడోలు

గ్రామపంచాయతీ ప్రజలకు మరింతగా అందుబాటులో ఉండేందుకు, వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు భీమడోలు గ్రామపంచాయతీ కార్యాలయానికి అదనంగా క్యాంపు కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు భీమడోలు సర్పంచి పి.సునీత మాన్సింగ్ తెలిపారు. క్యాంపు కార్యాలయాన్ని శుక్రవారం భీమడోలు రైతు సలహా మండలి ఛైర్మన్ పసుపులేటి సత్యనారాయణ, భీమడోలు జెడ్‌పిటిసి సభ్యులు తుమ్మగుంట భవానీరంగా శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భీమడోలు సొసైటీ అధ్యక్షుడు రాయపాటి సత్య శ్రీనివాస్, భీమడోలు ఎంపిటిసి సభ్యులు ముళ్లగిరి జాన్సన్, స్వచ్ఛంద సంస్థ చైతన్య యువజన సంఘం అధ్యక్షులు డాక్టర్ పి.మాన్సింగ్, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ

రోడ్డు నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా పలు రకాలైన వ్యాపారాలు చేసే వారు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా, రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ తమ వ్యాపారాలు నిర్వహించుకోవాలని, నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు చేపడతామని ఆగిరిపల్లి ఎస్ఐ ఎన్.చంటిబాబు హెచ్చరించారు. శుక్రవారం ఆయన తన సిబ్బందితో ట్రాఫిక్ క్లియరెన్స్‌పై చర్యలు చేపట్టి నిబంధనలను అతిక్రమించిన వ్యాపారులపై కేసులు నమోదు చేశారు.